క్లుప్తంగా

'10 బొల్లవరం'లో పొలంబడి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

నందికొట్కూరు: మండల పరిధిలోని 10బొల్ల వరం, దామగట్ల గ్రామాల పొలిమేరలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారి విజయశేఖర్ వరి, మినుము పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి పంటలో యాజమాన్య పద్ధతులను పాటించాలని, కంకి దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి రైతు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంట మార్పిడి, అధిక ఉత్పత్తి, లాభాలను ఆర్జించవచ్చన్నారు.

సాక్షి గణపతికి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని సాక్షి గణపతికి, జ్వాలా వీరభద్రస్వామికి లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

మరుగుదొడ్లను వినియోగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఎంపీపీ సువర్ణమ్మ, తాగునీటిశాఖ ఏఈ నాగేంద్ర తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఎవ్వరూ బహిర్భూమికి వెళ్లరాదని, ఇళ్లల్లోనే టాయ్‌లెట్లు నిర్మించుకొని, వినియోగించుకోవాలన్నారు. తద్వారా ఈగలు, దోమల వ్యాప్తిని అరికట్టి అంటురోగాల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో శివాచార్య మహాస్వామి



స్వామీజీకి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శ్రీశైల జగద్గురు శ్రీ 1008 చెన్న సిద్ధరాం పండితారాధ్య శివాచార్య మహాస్వామి బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశీర్వచన మండపంలో పండితులు వేదస్వస్తి పలికారు. అనంతరం ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు, వైదిక కమిటీ సభ్యులు రంగావఝల శ్రీనివాసశాస్త్రి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ తీగలు సరిచేయండి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఈ ప్రభాకర్‌రెడ్డి

మహానంది: గ్రామాలు, పంట పొలాల్లో ఎక్కడైనా విద్యుత్ తీగలు వేలాడుతూ ఉంటే వెంటనే సరిచేయాలని విద్యుత్ శాఖ మండల అసిస్టెంట్ ఇంజినీర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులు, రైతులు సమస్యలపై ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జేఈ మధు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా చిరు, వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక మధుమణి సమావేశ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, గౌరవ సలహాదారుగా న్యాయవాది రామచంద్రారావు, అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేష్, కో ఆర్డినేటర్లుగా రమేష్, శివరామిరెడ్డి, అజీజ్, వెంకటరమణ, కోశాధికారి అనిల్, సంయుక్త కార్యదర్శులుగా 15 మందిని ఎన్నుకున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు
- వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం





వెలుగోడులో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, పగిద్యాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ దివ్య

వెలుగోడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, మన ఉన్నతికి పుస్తకాలు ఎంతో మేలు చేకూర్చుతాయని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారిణి సుమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ గ్రంథాలయాధికారి రాఘవ రెడ్డి, డాక్టర్ పద్మావతమ్మ, మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, అమీర్ హంజా, రాము, రఘు స్వామి రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- బండిఆత్మకూరు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి మధు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ మోహన రెడ్డి పాల్గొన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గౌరీ, రేవతి, హర్షితలు, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సుమంత్, అరుణ కుమారి, సుప్రియ, చిత్ర లేఖనం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దీపిక, ప్రియాంక, నాగరుచితలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య, గ్రంథాలయ సిబ్బంది శకుంతలమ్మ, హుసేన్ శెట్టి, కస్తూరి బా గాంధీ, మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

పాములపాడు: ఈ నెల 14 నుంచి ప్రారంభమైన జాతీయ గ్రంథాల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సాయిరాం, రంగారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి కృష్ణారెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

పగిద్యాల: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీడీఓ సుమిత్రమ్మ ఆకాంక్షించారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పుస్తక పఠనం చేయడం అలవర్చుకోవాలని, అనేక పుస్తకాలు చదవడం వలన జ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, లైబ్రేరియన్ మద్దమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

- మిడుతూరు: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యాక్రమానికిని చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ తిరుపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వ్యాసరచన, చిత్ర లేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్, లైబ్రేరియన్ పరిమళ, వైద్య సిబ్బంది ముర్తుజావలి, శ్రీజ, జబీన్ తదితరులు పాల్గొన్నారు.



పాములపాడులో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయుడు



బండిఆత్మకూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

శ్రీశైలంలో 160 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో బుధవారం సాయంత్రం సమయానికి 159.7646 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ సుంకేసుల నుంచి 4,032 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. మంగళవారం నుంచి బుధవారం వరకు జలాశయానికి ఎగువ నుంచి 1,984 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరగా దిగువ ప్రాజెక్ట్‌లకు 19,660 క్యూసెక్కుల నీరు విడుదలైంది.ఎడమగట్టు కేంద్రంలో 4.535 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 874.20 అడుగులకు చేరుకుంది.

గిరిజనులకు పొలం ఇవ్వాలి

ఆత్మకూరు: గిరిజనులకు మూడు ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రమేష్, కార్యవర్గ సభ్యులు వి.యేసురత్నం డిమాండ్ చేశారు. బుధవారం అమలాపురంగూడెంలో ఏర్పాటు చేసిన పార్టీ మూడో మహాసభలో వారు మాట్లాడుతూ గిరిజనులు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 యేళ్లు దాటినా సొంత ఇల్లు కానీ, స్థలం కానీ లేకపోవడం దారుణమన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలను అందించాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మాబాషా, సి.వెంకటేశ్వర్లు, పక్కీరయ్య, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పది మందితో పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యం



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై విశాఖపట్నంకు చెందిన కె.సునీత, బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. గణపతికౌత్వం, ఆనంద నర్తన గణపతిం, నమశ్శివాయతే, శివపంచాక్షరి, గిరిజా కల్యాణం తదితర గీతాలకు ప్రణతి, గీతిక, దేవిక, ఐశ్వర్య, నందిత తదితరులు నృత ప్రదర్శన చేశారు.

పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలోని రోడ్లపైకి పశువులు రాకుండా వాటి యజమానులపై చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులకు బుధవారం ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందించారు. గోవులను యజమానులు పోషించకుండా రోడ్లపైకి వదులుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే పందులు, కుక్కల సంఖ్య పెరిగిపోయి గృహాల సమీపాలలో స్వైరవిహారం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్‌దార్‌ను కలిసిన వారిలో నాయకులు కె.నాగిరెడ్డి, ఓబులయ్య, అన్వర్‌బాషా, పులిరాజు, టి.మల్లికార్జున, శంకర్, వెంకట్, పూర్ణచంద్రరావు ఉన్నారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

జూపాడుబంగ్లా: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం ఆయన పారుమంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుపట్టికను పరిశీలించి, విధులకు హాజరైన వైద్యులు, వైద్యసిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది విధులు నిర్వహించే ప్రాంతాల్లోనే నివాసం ఉండటంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్యులు అందుబాటులో ఉంటున్నారా..వైద్యసేవలు అందిస్తున్నారా..ఆసుపత్రిలో ప్రసవాలు చేస్తున్నారా.. అంటూ రోగులను ఆరాతీశారు. నెలకు కనీసం ఐదు మంది గర్భిణులకు సుఖప్రసవాలు చేయాలని డాక్టర్ యశశ్వినికి సూచించారు. ఇదిలా వుండగా విధుల్లో ఉన్న డాక్టర్‌కు డీడీఓ అథారిటీ ఎందుకు అప్పగించలేదని డిప్యూటేషన్‌పై కర్నూలులో విధులు నిర్వహిస్తున్న యూడీసీ గిరిధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలవుల్లో ఉన్న డాక్టర్ మౌనిక డీడీఓ అథారిటీతో ఉద్యోగుల జీతభత్యాలు ఎలాచేస్తారని ప్రశ్నించారు. సత్వరమే డీడీఓ అథారిటీని విధుల్లో ఉన్న డాక్టర్ యశశ్వినికి అప్పగించాలని ఆదేశించారు.

రోగులకు అందుబాటులో లేకపోతే చర్యలు

నందికొట్కూరు: రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులోకి లేకపోతే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వరి పొలాల్లో జంతుకూనలు



వరి పొలాల్లో ఉన్న జంగం పిల్లిపిల్లలు

కొత్తపల్లి: వరి పొలాల్లో నాలుగు జంతుకూనలు ప్రజల కంటపడడంతో కలకలం రేగింది. అవి పులికూనలా...?పిల్లిపిల్లలా..? అన్న భయంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందారు. మండల కేంద్రం నుంచి హరిహరం వెళ్లే రహదారిలో గోవిందు అనే రైతుపొలంలో నాలుగు జంతుకూనలు రైతులకు బుధవారం దర్శనమిచ్చాయి. రైతులు సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు అందజేశారు. అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని అవి పులికూనలు కాదని, జంగంపల్లి పిల్లలేనని ఎఫ్ఎస్ఓ జ్యోతి స్వరూప్ నిర్ధారించారు. సాయంత్రం వరకు అటవీశాఖ సిబ్బందిని భద్రతగా ఉంచామని, పల్లి తన పిల్లలను తీసుకువెళ్లిందని ఎఫ్ఎస్ఓ తెలిపారు.

మినుము సాగులో మెలకువలు పాటించాలి



పంటపొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మినుము సాగు చేసుకున్న రైతులు పంటల ఎదుగుదల, తెగుళ్ల నివారణకు మెలకువలు పాటించాలని ఏఓ కె.మహేష్ సూచించారు. బుధవారం మండలంలోని నందికుంట గ్రామ శివారులోని పంట పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట ఎదుగుదల కోసం వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. పొలంలో అక్కడక్కడ తెగుళ్ల ఆశించిన మొక్కలను పీకేయాలని, తెల్లదోమ నివారణకు జిగురు పూసిన పసుపు రంగు అట్టలను పొలంలో 20 నుంచి 25 వరకు అక్కడక్కడ ఉంచుకోవాలని సూచించారు. లింగాకర్షక బుట్టలు ఎకరాకు 8 నుంచి 12 ఏర్పాటు చేసి తెగులు, దోమ ఉధృతిని అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నందికొట్కూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో ఈ నెల 21న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తునట్లు డిపో మేనేజర్ జీవీ నాగరాజు తెలిపారు. ప్రయాణికులు, పట్టణ ప్రజలు తమ ఫిర్యాదులు, అమూల్యమైన సలహాలు, సూచనలు ఫోన్ ద్వారా తెలియజేవచ్చన్నారు. సెల్ నంబరు 99592 25799కు ఫోన్ చేయాలన్నారు.

సర్టిఫికెట్ పొందిన తరువాతే ప్రీమియం చెల్లించాలి

జూపాడుబంగ్లా: రైతులు రబీలో సాగుచేసిన పంటలకు సంబంధించి రైతుసేవా కేంద్రాల్లో క్రాప్‌షోన్ సర్టిఫికెట్ పొందిన తర్వాతనే పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటలబీమా ప్రీమియం చెల్లింపు గడువును డిసెంబర్ 15 వరకు పొడించినట్లు తెలిపారు. రైతులు పంటలబీమా ఎలా చేయించుకోవాలని ఏఏ పంటలకు ఎంత ప్రీమియం చెల్లించాలనే విషయాలను గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏ లు, వీహెచ్ఏ లు అవగాహన కల్పించి, రైతులు పంటల బీమా చేయించుకొనేలా చేయాలన్నారు.

ఉన్నతి ద్వారా జీవనోపాధి

కొత్తపల్లి: ఉన్నతి పథకం ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని కుటుంబాలకు జీవనోపాధి కలిస్తామని ఏపీఓ హరికృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతి పథకం ద్వారా ఉపాధిలో హామీ పథకంలో 100 పనిదినాలు పూర్తియిన కుటుంబంలో ఒకరికి శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పిస్తామన్నారు. మూడునెలలో శిక్షణలో రోజు వేతనం రూ.300 ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో ఎన్ని కుటుంబాలు 100 పనిదినాలను పూర్తి చేసుకున్నాయో గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్,ఈసీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ఆలమూరులో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ

రుద్రవరం: అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ విజయ్ బాబు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఆలమూరులో వివిధ దశల్లో పనులు సాగుతున్న గృహాలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాజ్ యోజన గ్రామీణ్ కింద మంజూరై వివిధ దశల్లో ఉన్న వాటిని 2025 మార్చి ఆఖరు నాటికి పూర్తి చేసుకోవాలని చెప్పారు. బిల్లులు పెండింగ్ లేవని ఎప్పటికప్పుడు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏఈ నాగరాజు,వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ ఉన్నారు.

శ్రీశైలంలో కార్తీక దీపారాధన



ఆకాశదీపానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పలువురు భక్తులు వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, దేవస్థానం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాడవీధిలో దీపారాధన చేశారు. పలువురు భక్తులు లక్ష దీపాలు వెలిగించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అలాగే ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు ఆకాశ దీపాన్ని వెలిగించారు.

గురకను నిర్లక్ష్యం చేయరాదు

ఉయ్యాలవాడ: చిన్నారుల్లో గురకను నిర్లక్ష్యం చేయరాదని, ముక్కు వెనుక భాగంలో ఆడినాయిడ్స్ పరిమాణం పెరిగి అది పని చేసే శక్తిని కోల్పోయినప్పుడు ఇన్‌ఫెక్షన్ సోకి గురక, జలుబు వంటి శ్వాస ఇబ్బందులు కలుగుతాయని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం అల్లూరులో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఉయ్యాలవాడ ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న 84 మందికి వైద్య సేవలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మధ్యాహ్నం నుంచి ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. సాయంత్రం దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

వరిలో పంట కోత ప్రయోగం



నెహ్రూ నగర్‌లో వరిలో పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

గోస్పాడు: పంట కోత ప్రయోగాలతో దిగుబడులను అంచనా వేసేందుకు ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగం చేశారు.డీఏఓ మాట్లాడుతూ రైతులు పైర్ల సాగు సమయంలో సరైన సస్యరక్షణ పద్ధతులు నిర్వహించాలని తెలిపారు. వరిలో పంట కోత ప్రయోగం నిర్వహించగా రాయల్ మైక్రో ఫుడ్ వాడి పొలంలో దిగుబడి ఎకరాకు 40బస్తాలు రాగా వాడని పొలంలో 43బస్తాల దిగుబడి వచ్చిందన్నారు. జిల్లాలో సరాసరి దిగుబడి 35 బస్తాలు వచ్చే అవకాశముందన్నారు.

నంద్యాల(అర్బన్): చాపిరేవుల గ్రామంలో రైతు శ్రీనివాసులుకు చెందిన వరి పొలంలో అధికారులు బుధవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఏఎస్ఓ ప్రహ్లాద, సూపర్‌వైజర్ ఓబులేసు ఆధ్వర్యంలో నిర్ణీత కొలతల ప్రకారం ప్రయోగం నిర్వహించగా ఎకరాకు 36 సంచుల దిగుబడి లభిస్తుందని చెప్పారు.

మిడుతూరులో న్యాయ విజ్ఞాన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి దివ్య

మిడుతూరు: స్థానిక మండల సమాఖ్య భవనంలో బుధవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి దివ్య మహిళలపై జరుగుతున్న అరాచకాలు, లైంగిక వేధింపులు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల్లో చట్టాలు కల్పిస్తున్న రక్షణ గురించి వివరించారు. మహిళలకు ఏవైనా సమస్యలు ఉంటే న్యాయసేవ సంస్థకు సంప్రదిస్తే న్యాయ సలహాలు, సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామయ్య, వెలుగు ఏపీఎం సుబ్బయ్య, న్యాయవాదులు మద్దయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలను సందర్శించిన ఆర్డీఓ



కృష్ణానదిలో కార్తీక దీపం వదులుతున్న ఆర్డీఓ

కొత్తపల్లి: మండలంలోని పుణ్యక్షేత్రాలు కొలనుభారతిదేవి, సంగమేశ్వరం వద్ద ఉమామహేశ్వరాలయాన్ని బుధవారం ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి నాగజ్యోతి దర్శించుకున్నారు. కొలను భారతి దేవి ఆలయంలో పురోహితులు శ్రీనివాస శర్మ, రామయ్యలు ఆలయ సంప్రదాయంతో స్వాగతం పలికారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు చేసుకున్నారు. అదేవిధంగా సప్తశివాలయాలలో పూజలు చేసుకున్నారు. అనంతరం సంగమేశ్వరం చేరుకొని కృష్ణానదిలో కార్తీక దీపాలు వదిలారు. ఎగువన ఉమామహేశ్వరాలయంలో లలితాదేవి అమ్మవారికి, శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, అర్చనలు గావించారు. ఆమె వెంట తహసీల్దార్ ఉమారాణి, వీఆర్వోలు ఉన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న టిప్పర్

- ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు

జూపాడుబంగ్లా: విజయవాణి స్కూలు బస్సును వెనుక నుంచి పీఎస్‌ఐ కంపెనీ టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలైన ఘటన బుధవారం మండలకేంద్రంలో చోటుచేసుకుంది. నందికొట్కూరు పట్టణంలోని విజయవాణి స్కూలుకు చెందిన బస్సు బుధవారం సాయంత్రం విద్యార్థులను వదిలిపెట్టేందుకు జూపాడుబంగ్లాకు చేరుకుంది. వ్యాను డ్రైవరు స్కూలు బస్సును రోడ్డుపైన నిలబెట్టి విద్యార్థులను బస్సులోంచి కిందికి దింపుతుండగా అతివేగంగా వచ్చిన పీఎస్‌కే టిప్పర్ వెనుక నుంచి ఢీకొంది. బస్సులో 30 మంది విద్యార్థులు ఉండగా 28 మంది క్షేమంగా బయటపడ్డారు. ఇద్దరికి కడ్డీలు కొట్టుకొని స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్లను మందలించారు.

నాటుసారా స్వాధీనం

నందికొట్కూరు: పట్టణంలోని నీలిషికారిపేటలో నాటు సారా విక్రయిస్తున్న నీలిషికారి ఇబ్రామ్‌ను ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, ఎస్ఐలు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా నాటుసారా విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్ఐ జప్రుల్లా, హెడ్‌కానిస్టేబుల్ శంకర్ నాయక్, పద్మనాభం, పోలీసులు ఉన్నారు.